పేదోళ్లపై వేటు పెద్దోళ్లకు చోటు..!

ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో మూడో రోజైన గురువారం సరిగ్గా ఇవే దృశ్యాలు కనిపించాయి. ఎంపిక జాబితాల్లో తమ పేర్లను తొలగించడంతోపాటు అనర్హులకు చోటు కల్పించారంటూ భగ్గుమన్నారు. పేదోళ్లమైన తమకు తీవ్ర అన్యాయం చేశారంటూ ఆగ్రహోదగ్రులయ్యారు. ఒకచోట– గ్రామసభను బహిష్కరిస్తే, మరోచోట– గ్రామసభలోనే ధర్నాకు దిగారు. ఈ పరిస్థితి తీవ్రతకు జడిసిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. షెడ్యూల్ ప్రకారం తాను పాల్గొనాల్సిన ఓ గ్రామసభకు దూరంగా ఉన్నారు. ఇదే ఎమ్మెల్యేకు అన్నపురెడ్డిపల్లి గ్రామసభలో చేదు అనుభవం ఎదురైంది. ఓ మహిళ (భూక్యా లక్ష్మి).. ''ఇంతవరకూ రైతు బంధు ఎందుకు ఇవ్వలేదు..? కేసీఆర్ మంచిగా ఇచ్చిండు. పెన్షన్ డబ్బులు పెంచి ఇస్తమన్నారు.. ఇంకా ఎందుకు పెంచలేదు..?'' అని ప్రశ్నించింది. ''నిధులు లేకపోవడంతో జాప్యం జరిగింది'' అంటూ ఆమెకు ఎమ్మెల్యే నచ్చజెప్పారు. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా గ్రామసభలో.. అర్హులమైన తమ పేర్లు ఎందుకు లేవని, అనర్హులైన కాంగ్రెసోళ్ల పేర్లు ఎలా చేర్చారని అంటూ.. ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలోనే అధికారులను పేదలు నిలదీశారు. దీనిని సహించలేని కాంగ్రెస్ నాయకుడైన మాజీ సర్పంచ్ ఒకరు.. ప్రశ్నించిన వారిని బెదిరించేందుకు యత్నించారు. జాబితాల్లో తమ పేర్లు లేవనే ఆవేదన–ఆగ్రహంతో ముందుకు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. బక్కోళ్ల కడుపు కొట్టి, బలిసినోళ్ల బొజ్జ నింపితే.. లేనోళ్లకు 'కోత' కోసి, ఉన్నోళ్లకు 'మేత' వేస్తే.. పేదోళ్లపై 'వేటు' వేసి, పెద్దోళ్లకు 'చోటు' ఇస్తే.. ఏమవుతుందో ఈ గ్రామసభల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 'బాధితులు' ఇలా స్పష్టంగా చెప్పారని అనుకోవచ్చేమో..!

– 'నమస్తే' న్యూస్ నెట్‌వర్క్

బక్కోళ్ల కడుపు కొట్టి.. బలిసినోళ్ల బొజ్జ నింపితే..
లేనోళ్లకు 'కోత' కోసి.. ఉన్నోళ్లకు 'మేత' వేస్తే..
పేదోళ్లపై 'వేటు' వేసి.. పెద్దోళ్లకు 'చోటు' ఇస్తే..

బక్కోళ్లు–లేనోళ్లు–పేదోళ్లు.. అనబడే ఆ బడుగులంతా..
ఒకరొక్కరుగా లేచి నిలబడతారు..!
ఒక్క గొంతుకగా నిగ్గదీసి అడుగుతారు..!!
ఒక్కటిగా లేచి భగభగమంటూ మండిపడతారు..!!

భద్రాచలం : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆళ్ళపల్లి : అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పినపాక : జానంపేట గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

అశ్వాపురం : అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న ప్రజలు

బూర్గంపహాడ్ : మోరంపల్లిబంజర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామప్రజలు

దమ్మపేట: అధికారులపై మహిళల ఆగ్రహం

చుంచుపల్లి: నాయకుల మధ్య వాగ్వాదం

చండ్రుగొండ: యువకులను అదుపు చేస్తున్న పోలీసులు

పర్ణశాల గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

దుమ్ముగూడెం : మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్

అశ్వారావుపేట: ములకలపల్లిలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

జూలూరుపాడు: గ్రామసభలో బైఠాయించిన బాధితులు

టేకులపల్లి: పజలను సముదాయిస్తున్న పోలీసులు

అశ్వారావుపేట టౌన్: అధికారులను నిలదీస్తున్న దృశ్యం

కొత్తగూడెం టౌన్: అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పాల్వంచ రూరల్: అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

అన్నపురెడ్డిపల్లి: అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

చర్ల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం

కరకగూడెం మండలం భట్టుపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

విమానాశ్రయానికి స్థలం పరిశీలన

రామవరం, జనవరి 23: జిల్లాలో విమానాశ్రయానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు ఢిల్లీ నుంచి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం గురువారం వచ్చింది. ఇందులో ఏరో ప్లానింగ్ అదికారి అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్చర్ అధికారి మహ్మద్ సాకీబ్, ఆపరేషన్ అధికారి ప్రశాంత్ గుప్తా, సీఎన్ఎస్ అధికారి దివాకర్, ఇంజినీరింగ్ అధికారి మనీష్ జోన్వాల్, ఎఫ్‌పీడీ అధికారి ప్రవీణ్ ఉన్నారు. కొత్తగూడెం, గరీబ్‌పేట, సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో పర్యటించింది. విమానాశ్రయం ఏర్పాటుకు మొత్తం 950 ఎకరాల భూమిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన కేంద్ర బృందంతో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, సీపీవో సంజీవరావు, ఎంపీటీసీ ఎల్ ఎస్సీ మహేందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, సుజాతనగర్ తహసీల్దార్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న బృందంతో కలెక్టర్, ఎంపీ

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

అశ్వారావుపేట, జనవరి 23: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకను టీజీటీడబ్ల్యూ ఆర్‌డీసీలో వైస్ ప్రిన్సిపల్ వి.సింధుశ్రీ గురువారం 'పరాక్రమ్ దివస్'గా నిర్వహించారు. అధ్యాపకులు ఎస్‌కె.సుఫీయన్, అరు ణ, భవాని, సుధారాణి, ఉమ తదితరులతో కలిసి నివాళులర్పించారు.

పాల్వంచ, జనవరి 23: పాల్వంచలో నేతాజీ యువజన సంఘం నిర్వహించిన వేడుకలో న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ భానుమతి మాట్లాడారు. నేతాజీ ఉద్యమ చరిత్రను వివరించారు. స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ అందించారు. ఆస్పత్రి డాక్టర్లు సోమరాజు దొర, రాంప్రసాద్, నామ బుచ్చయ్య, సంఘం అధ్యక్షుడు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, జనవరి 23: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజా విగ్రహానికి ప్రిన్సిపాల్ వై.చిన్నప్పయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాచలం, జనవరి 23: భద్రాచలం పట్టణంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయం వద్ద గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డెక్కా నర్సింహారావు, గగ్గూరి బాలకృష్ణ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పడిగ నర్సింహారావు, అపర్ణ లింగమూర్తి, రవీందర్, అంజిబాబు, హరి, బాషా, అనిల్, హరీష్, టీఎన్‌జీవోస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 23: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే గ్రామసభలు

అశ్వాపురం, జనవరి 23: ప్రజలను మభ్యపెట్టి పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో గ్రామసభలు నిర్వహిస్తున్నారు తప్ప ప్రజలకు మేలు చేసేందుకు కాదని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి విమర్శించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

పంచాయతీ ఎన్నికల కోసమే గ్రామసభలు

పినపాక, జనవరి 23: కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం ఈబయ్యారం అడ్డరోడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మండలంలో పేద ప్రజలను మోసం చేసేందుకు ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని విమర్శించారు. భద్రయ్య, భవానిశంకర్, వర్మ, గుమ్మడి గాంధీ, వాసుబాబు, వెంకటేశ్వరరెడ్డి, రాము, గణేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వైభవంగా సారలమ్మ జాతర

కరకగూడెం, జనవరి 23: మండలంలోని చొప్పాల గ్రామ సమీపంలో చిన్నగుట్ట మీద వెలసిన ఆదివాసీల ఆరాధ్యదైవం సారలమ్మ తల్లి జాతర గురువారం వైభవంగా జరిగింది. నిండు జాతర కావడంతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. తల్లి వనం నుంచి జనంలోకి రావడంతో డోలు వాయిద్యాల మధ్య తల్లి గద్దెలపై కొలువుదీరింది. దేవర బాల సమక్షంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

సారలమ్మ తల్లిని గద్దెలపైకి తీసుకువస్తున్న భక్తులు

పాఠశాల స్థాయి క్రీడలు ప్రారంభం

దుమ్ముగూడెం, జనవరి 23: మండల పరిధిలోని నర్సాపురం సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల స్థాయి ఆటల పోటీలను హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావు ప్రారంభించారు.

కార్పొరేషన్ ఏర్పాటుతో 'కొత్త'గూడెం

కొత్తగూడెం అర్బన్, జనవరి 23: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో పట్టణ రూపురేఖలు మారుతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 11వ వార్డులో అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. కొత్తగూడేన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, డీఈ రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముగిసిన హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు

పాల్వంచ, జనవరి 23: పాల్వంచలోని కేటీపీఎస్‌లో టీజీ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. విజేత జట్లకు కప్పులను జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య అందజేశారు. సీఈలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, మోక్షవీర్, స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, కేటీపీఎస్ 5,6 దశల స్పోర్ట్స్ కార్యదర్శి వీరస్వామి, వైటీఎంకే రాజు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జీవో 64ను నిలిపివేయాలి

భద్రాచలం, జనవరి 23: జీవో 64ను నిలిపివేసి ఇప్పుడు చెల్లిస్తున్న విధంగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు కలెక్టర్ కనీస వేతనాల సర్క్యులర్ ప్రకారం యథావిధిగా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జీవో 64ను నిలిపివేయకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. హీరాలాల్, పాయం ముత్తయ్య, మంగమ్మ, కౌసల్య పాల్గొన్నారు.

ఇదేనా మీ ప్రజాపాలన...?

బూర్గంపహాడ్, జనవరి 23: పోలీసుల పహారా మధ్య గ్రామసభలు ఎందుకు నిర్వహిస్తున్నారు.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఎందుకు వ్యవహరిస్తున్నారు.. ఇదేనా మీ ప్రజాపాలన అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పున్నంచంద్ పాలనాతీరుపై మండిపడ్డారు. పోలీసుల కనుసన్నల్లో గ్రామసభలు జరుగుతుండడం చేతకాని పాలన ప్రభుత్వ పాలనకు నిదర్శనమని విమర్శించారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలన్నీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీఎన్‌టీయూసీకి ఎంఈఎఫ్ ఉద్యోగుల మద్దతు

ఎంఈఎఫ్ ఉద్యోగులతో కనకమేడల

బూర్గంపహాడ్, జనవరి 23: ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలకు మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) ఉద్యోగులు గురువారం మద్దతు పలికారు. సకాలంలో మంచి వేతన ఒప్పందం చేసి సమర్థవంతంగా పనిచేస్తూ మళ్లీ గెలుపు దిశగా వెళుతున్న టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలకు రాబోయే వేతన ఒప్పందం చేయగల సత్తా ఉందని పేర్కొన్నారు. టీఎన్‌టీయూసీకి ఎంఈఎఫ్ నుంచి 26 మంది మద్దతు పలికినట్లు టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ తెలిపారు.

'డ్రాయింగ్' విజేతగా వర్షిత

ప్రశంసాపత్రం అందుకుంటున్న వర్షిత

దమ్మపేట, జనవరి 23: జిల్లా కేంద్రంలో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో మూడవ బహుమతిని దమ్మపేట మండలం పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.వర్షిత దక్కించుకుంది. ఆ విద్యార్థినికి డీఈవో వెంకటేశ్వరచారి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. జిల్లా స్థాయి డ్రాయింగ్‌లో ప్రతిభ కనబర్చిన వర్షితను పాఠశాల హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'దివ్యాంగ' సంఘం కార్యదర్శిగా బానోతు లక్ష్మా

టేకులపల్లి, జనవరి 23: తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగ ఉపాధ్యాయ–ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బానోత్ లక్ష్మా ఎన్నికయ్యారు. స్థానిక వాగొడ్డు తండా ప్రాథమిక పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నోముల

టేకులపల్లి, జనవరి 23: ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా టేకులపల్లి మండలానికి చెందిన నోముల భాను చందర్ ఎన్నికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో బుధవారం జరిగిన రెండు యువజన సంఘాల విలీన సభలో నూతన కమిటీ ఎన్నికైంది. సహాయ కార్యదర్శిగా నోముల భాను చందర్ ఎన్నికయ్యారు. ఆ

యువతి అదృశ్యం

అశ్వారావుపేట రూరల్, జనవరి 23: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(22) ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు అన్నిచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఆమె తల్లి ఫిర్యాదుతో కేసును ఎస్సై యయాతి రాజు నమోదు చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లెందు/ఇల్లెందు రూరల్, జనవరి 23: ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్న డిమాండుతో సీపీఐ–ఎంఎల్ (న్యూడెమోక్రసీ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న 'చలో హైదరాబాద్' జరగనుంది. ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాన్ని జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు గురువారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఆయిల్‌పాం నర్సరీ పరిశీలన

అశ్వారావుపేట/సత్తుపల్లి టౌన్, జనవరి 23: సత్తుపల్లి మండలం రేగళ్ళపాడులోని ఆయిల్‌పాం నర్సరీని ఆయిల్‌పాం రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.పుల్లయ్య గురువారం పరిశీలించారు. నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసిన కంపెనీ నుంచి బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అశ్వారావుపేట, జనవరి 23: ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గుమ్మడవల్లికి చెందిన గుత్తి మారేశ్వరికి, కోయ రంగాపురం గ్రామస్తుడు సురేష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. అదనపు కట్నం కోసం కొంతకాలంగా వేధిస్తుండగా తట్టుకోలేక పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో సురేష్‌పై గురువారం ఎస్సై కేసు నమోదు చేశారు.